www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 2 ఆగస్టు 2025

శ్రీసిటీని సందర్శించిన 'అక్షరధాం' ఆధ్యాత్మిక గురువులు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

ఢిల్లీలోని ప్రముఖ అక్షరధాం స్వామి నారాయణ్ ఆలయానికి చెందిన ఆధ్యాత్మిక గురువులు అక్షర్ ప్రేమ్, వినమ్రవదన్ శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. వీరికి సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వారికి వివరించారు. ప్రత్యేకించి శ్రీసిటీ పేరుకున్న ఆధ్యాత్మిక ప్రాధాన్యత గురించి హైలైట్ చేశారు. పర్యటనలో భాగంగా పారిశ్రామికవాడ పరిసరాలతో పాటు స్థానిక శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని, అక్కడ ఏర్పాటు చేసిన శ్రీసిటీ ఉద్యానవనాన్ని స్వామీజీలు సందర్శించారు. అక్కడనుంచి డైకిన్ ఏసీ పరిశ్రమకు వెళ్లి సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు.

1.54 లక్షల మందికి లబ్ధి
నేడు రైతుల ఖాతాల్లో నగదు జమ
పెండింగ్ ఖాతాలు 5 వేలకు పైనే
గతం కన్నా 30 వేల మందికి కోత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. 'అన్నదాత సుఖీభవ' అనేందుకు రంగం సిద్ధం చేసింది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 1,54,807 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో మొదట విడత సుఖీభవ నగదును శనివారం జమ చేయనుంది. సూపర్ సిక్స్ పథకాల అమల్లో భాగంగా 'పీఎం కిసాన్-అన్నదాతా సుఖీభవ' పథకాన్ని ఆగస్టు 2న అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు తిరుపతి జిల్లాలోని రైతులకు అన్నదాత సుఖీభవ నగదు బదిలీ కార్యక్రమాన్ని శనివారం శ్రీకాళహస్తిలోని ఏపీ సీడ్స్ వద్ద జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రారంభించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 5 వేలు, కేంద్ర ప్రభుత్వం వాటా రూ. 2 వేలు రైతుల ఖాతాల్లో జామ కానుంది.

గతం కన్నా 30 వేలు మందికి కోత

గత ప్రభుత్వ హయాంలో తిరుపతి జిల్లా వ్యాప్తంగా 1.81 లక్షల మంది రైతు భరోసా పథకానికి అర్హులుగా ఉన్నారు. అయితే ప్రభుత్వం ఆ సంఖ్యను 1.54 లక్షలకు కుదించింది. వివిధ కారణాల చేత సుమారు 30 వేల మంది రైతులు అనర్హతకు గురయ్యారు. ఇదిలా ఉంటే అన్నదాతా సుఖీభవ పథకానికి జిల్లాలో అర్హత సాధించిన సుమారు 5 వేల మంది రైతులకు ఆధార్ సీడింగ్, పేర్లు, ఇంటి పేర్లు తప్పుగా నమోదు కావడం, చనిపోయిన వారి స్థానంలో వారసుల పేర్లు నమోదు కాకపోవడం వంటి సమస్యలు తహశీల్దార్ల లాగిన్లలో పెండింగులో ఉన్నాయి.

మండలం	అర్హులు
పుత్తూరు	4163
పాకాలలో	4959
తిరుపతి (రూరల్)	3097
తడ	3284
శ్రీకాళహస్తి	10663
వరదయ్యపాలెం	4326
రేణిగుంట	3359
చిల్లకూరు	4563
పిచ్చాటూరు	3279
వాకాడు	3769
బి.ఎన్.కండ్రిగ	4845
చంద్రగిరి	4522
రామచంద్రాపురం	4384
సత్యవేడు	3473
నారాయణవనం	2671
యర్రావారిపాలెం	5062
సూళ్ళూరుపేట	4059
నాయుడుపేట	4329
డక్కిలి	5060
వెంకటగిరి	3683
దొరవారిసత్రం	5256
గూడూరు	5213
చిన్నగొట్టిగల్లు	4323
ఏర్పేడు	8248
ఓజిలి	4541
చిట్టమూరు	4688
తొట్టంబేడు	6060
కె.వి.బి.పురం	7454
పెళ్ళకూరు	4973
బాలాయపల్లి	5356
కోట	3792
వడమాలపేట	3483

లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలి : ఐద్వా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో మహిళల అంతర్గత కమిటీలు వేర్పాలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి కలెక్టర్ వెంకటేశ్వర్లుకు విన్నవించారు. ఇటీవల కాలంలో మహిళలపై జరిగిన లైంగిక వేధింపుల వివరించారు. నాయుడుపేటలో నివాసం ఉండే విఆర్ఓను వాకాడ తహశీల్దార్ గత కొంతకాలంగా లైంగికంగా వేధింపులకు పాల్పడ్డాడన్నారు. సంబంధిత తహశీల్దార్‌ను కలెక్టర్ సస్పెండ్ చేయడం హర్షనీయమన్నారు. పది మంది మహిళలు పనిచేస్తున్నచోట ఖచ్చితంగా లైంగిక వేధింపుల నిరోధక అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు చెప్పినా అమలు కావడం లేదన్నారు. బయటకు చెబితే ఎక్కడ పరువు పోతుందని మహిళలు లోలోనే కుమిలి పోతున్నారన్నారు. గతంలో టిటిడిలోనూ ఓ మహిళా కార్మికురాలు అక్కడ పనిచేస్తున్న సూపర్‌వైజర్‌ను కొట్టిందని గుర్తు చేశారు. స్విమ్స్‌లో మహిళా డాక్టర్లు తోటి డాక్టర్ వేధింపులకు గురిచేయడం కేసు నమోదయ్యిందన్నారు. రైల్వే కాంట్రాక్టు కార్మికులనూ అక్కడ పనిచేసే సూపర్‌వైజర్ వేధిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆఫీసుల్లో, కళాశాలల్లో, ఆస్పత్రుల్లో, షాపింగ్‌మాల్స్‌లో, యూనివర్సిటీలో, టిటిడిలో వేలాది మంది మహిళలు పనిచేస్తున్నారని, వారు విధుల్లో ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

సామాజిక పింఛన్లను అందుకున్న లబ్ధిదారులు

నిబంధనలు మీరి పింఛన్ల పంపిణీ

ఉన్నతాధికారులకు సిపిఎం ఫిర్యాదు
పింఛన్ల పంపిణీలో జిల్లా రెండవ స్థానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను ఆగస్టు నెలకు సంబంధించి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే చేర్చాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నా తిరుపతి నగర పరిధిలోని సుందరయ్య నగర్, సప్తగిరి నగర్ లో ఓ మహిళ సచివాలయ ఉద్యోగిని వయోవద్ధులను అందరినీ ఒకచోటికి రమ్మని పింఛను పంపిణీ చేయడంతో సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, పార్టీ నేతలు గమనించి తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు ఆ సచివాలయ ఉద్యోగిని అధికారుల చివాట్లు తర్వాత లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో తిరుపతి జిల్లా రెండవ స్థానంలో నిలిచి 94.8 శాతం పింఛన్ల పంపిణీ జరిగినట్లు డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు తెలిపారు. ఆగస్టు మాసానికి సంబంధించి స్పౌజ్ పింఛన్లు 4771 మంజూరు కావడం పట్ల లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

నిరాశ్రయులకు వసతులు కల్పించాలి: కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

నిరాశ్రయులకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో షెల్టర్ ఫర్ అర్బన్ హోమ్ లెస్ కౌన్సిల్ కమిటీ మీటింగ్ ను కమిషనర్ నిర్వహించారు. పట్నూల్ వీధి లో షెల్టర్ ను హోప్ ఫౌండేషన్ వారు నిర్వహిస్తున్నారు. వారి ఒప్పందకాలం ముగియడంతో స్వచ్ఛందంగా తప్పుకున్నారు. ఈ షెల్టర్ నిర్వహణ బాధ్యతను అమ్మ ఫౌండేషన్ వారు నిర్వహించేందుకు ముందుకు రావడంతో వారికి అప్పగించేందుకు సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయించామని కమిషనర్ తెలిపారు. షెల్టర్లలో అన్ని వసతులు ఉండేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమములో కమిటీ సభ్యులు డిసిపి ఖాన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, సిఎంఎంలు కష్ణవేణి, సోమ కుమార్ పాల్గొన్నారు.

ఐఐటీలో పరిశోధన, ఆవిష్కరణ వ్యూహాలపై చర్చ

ప్రజాశక్తి-ఏర్పేడు

ఏర్పేడు సమీపంలోని ఐఐటి తిరుపతిని సందర్శించిన 'అనుసంధన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్' సీఈవో శివకుమార్ కళ్యాణ్ రామన్ అధ్యాపక సభ్యులతో కలిసి సహకార పరిశోధన కార్యక్రమాలు వాటి ఆవిష్కరణ వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార, అంతర్ విభాగ పరిశోధన ప్రతిపాదనలను పెంపొందించడం, ప్రభావవంతమైన పరిష్కారాల కోసం లోతైన సాంకేతిక పరిశోధన, అభివద్ధియే ఏఎన్ ఆర్ఎఫ్ యొక్క ప్రధాన లక్ష్యం అని అన్నారు. ఆర్ అండ్ డి వ్యూహాలు, అనువాద పరిశోధన, పరిశోధకుల సామర్థ్య నిర్మాణం, అధునాతన పరిశోధన గ్రాంట్లు, కన్వర్జెన్స్ సిఓఈ లు, హబ్-అండ్-స్పోక్ పరిశోధన నమూనాలు, పీఎం ఈసీఆర్ జి పథకం, మెడ్‌టెక్‌లో సవాళ్లను పరిష్కరించడం, వాతావరణ స్థిరత్వం, స్మార్ట్ మౌలిక సదుపాయాలు, మహా ఈవీ మిషన్‌లపై చర్చించారు.

ఎవరికీ నష్టం కలిగించం : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

గాంధీ రోడ్డులోని హథీరాంజీ మఠంలో దుకాణాలు నిర్వహిస్తున్న ఎవ్వరికీ ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. పురాతనమైన హథీరాంజీ భవనం కూల్చడం పై శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, దుకాణ దారులతో కమిషనర్ సమావేశమై వారి అభిప్రాయాలను సేకరించారు. పలువురు దుకాణదారులకు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఎక్కడైతే కూలిపోయే పరిస్థితి ఉందో అక్కడ మరమ్మత్తులు చేయించాలని కోరారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ హథీరాంజీ మఠంను ఐఐటి తిరుపతి కి చెందిన నిపుణులు పరిశీలించి రిపోర్ట్ ఇచ్చారన్నారు. రానున్న వర్షా కాలంలో ప్రజలకు ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపడతాని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ బోర్డు చైర్మన్ సుగుణమ్మ, రాష్ట్ర అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వూకా విజయకుమార్, డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికష్ణ, మఠం ఏ.డి.బాపిరెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, తహసీల్దార్ సురేంద్ర బాబు పాల్గొన్నారు.

తల్లిపాలు శిశువుకు ఆరోగ్యం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తల్లులు వీలైనంత తొందరగా తమ పిల్లలకు తమ పాలను పట్టించడంద్వారా అటు పిల్లలకు, ఇటు తల్లులకు ఎంతో ఆరోగ్యకరమని తిరుపతి ఈఎస్ ఐ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. శ్యాంబాబు, స్పెషల్ గ్రేడ్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్. యు. వెంకయ్య పేర్కొన్నారు. స్థానిక ఆర్సి రోడ్ లోని ఈఎస్ఐ ఆసుపత్రిలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు తమ చిన్నారులకు ఎలా పాలను పట్టించాలి అనే అంశాలు, తల్లి పాల వల్ల పిల్లలకు కలిగే ఉపయోగాలను స్పెషలిస్ట్ డాక్టర్స్ కె. పద్మావతి, పి. ఎస్. చందన మహిళలకు వివరించారు. ఎఎన్ ఎంలు హేమలత, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

అమ్మపాలు 'అమృతం'

ప్రజాశక్తి-తొట్టంబేడు

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

తల్లిపాలు బిడ్డకు అమృతంలా పనిచేస్తాయని శ్రీకాళహస్తి ఐసిడిఎస్ శాఖా సూపర్వైజర్ మరియమ్మ తెలిపారు. స్థానిక రామచంద్రాపురం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలు కేవలం బిడ్డ ఎదుగుదలకే కాకుండా రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. అయితే ప్రస్తుత సమాజంలో కొందరు తల్లులు పాశ్చాత్య ధోరణికి అలవాటు పడి బిడ్డకు పాలిచ్చే సంప్రదాయానికి తిలోదకాలిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది బిడ్డపై తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సురేఖ, హెల్పర్ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకి తల్లిపాలే అమృతం : కృష్ణవేణి, సిడిపిఓ

ఏర్పేడులో.. రేణిగుంట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఏర్పేడు మండలంలోని అంజిమేడు, పల్లాం పేట అంగన్వాడి కేంద్రాలలో సిడిపిఓ క్రిష్ణవేణి అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. సిడిపిఓ కష్ణవేణి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం వలన తల్లీ బిడ్డకి కలిగే ప్రయోజనాలు, ప్రాముఖ్యత, తల్లిపాలు కల్తీ లేనివని, స్వచ్ఛమైనవి కాబట్టి తల్లిపాలు పిల్లలకు వరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ హేమావతి, రత్నమ్మ, అంగన్వాడి కార్యకర్తలు స్వర్ణలత, రాజేశ్వరి పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి ఇంటిని కాపాడాలని ఎస్పీకి వినతి

ప్రజాశక్తి -తిరుపతి సిటి

తిరుమలలో ఉన్న తమ ఇంటిలోకి దౌర్జన్యంగా ప్రవేశించి, కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఆర్.సుధర్ ఎస్పీ హర్షవర్దన్‌రాజుకు విన్నవించారు. తిరుపతి పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో ఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ తిరుమల శ్రీవారి ఆలయ సమీపంలో ఉన్న సాదూరుమఠం సందులో ఉన్న తమను టిటిడి పునరావాసం కింద ఆర్బి సెంటర్‌ను నిర్మించి 1977లో ఆర్ఒసి నంబర్ ఎస్3/9968/74, తేది 11.02.1977 (14/156) ఇంటిని కేటాయించింది. ఆ ఇంటి కేటాయింపుల సందర్భంగా తన తండ్రి ఆర్.క్రిష్ణయ్య (లేట్)కు వయస్సు తక్కువగా ఉందని, తన తండ్రి అక్క కె.సుబ్బరత్నమ్మ పేరుపై టిటిడి అధికారులు ప్రొసీడింగ్ ఇచ్చి అలాట్‌మెంట్ ఇచ్చారు. తన అత్త కె.సుబ్బరత్నమ్మకు పిల్లలు లేరు. తామంతా కలిసి ఒకే ఇంటిలో ఉమ్మడి కుటుంబంగా ఉండేవారమని, తన అత్త సుబ్బరత్నమ్మ ఆరోగ్యం క్షీణించడంతో తామే చూసుకున్నామన్నారు. ఆమె తదనంతరం టిటిడి ద్వారా వచ్చిన ఇంటికి వారసులుగా ఆర్.సుధీర్, శ్రీధర్ పేర్లపై 2011, అక్టోబర్ 12న వీలునామా రాసి మృతిచెందింది. తన అత్త సుబ్బరత్నమ్మ మరణానంతరం తమ ఇంటిరి ఆరు నెలల పాటు మూసేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించి తాళం వేశారు. అయితే తన తండ్రికి చెల్లెలైన జయమ్మ కుమార్తె విజయలక్ష్మి, ఆమె భర్త నాగభూషణం అలియాస్ టోకీ (టిటిడి విశ్రాంత ఉద్యోగి) మా అత్త కూతురని చెప్పుకుంటూ మూసి ఉంచిన ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి తిష్ట వేశారన్నారు. ప్రస్తుతం నకిలీ డాక్యుమెంట్లను చూపించి, వారి పేర్లతో నమోదు చేసుకోవాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. తన వద్ద ఉన్న ఒరిజినల్ డాక్యుమెంట్లను అధికారులకు చూపించి, తమ పేర్లను నమోదు చేసుకున్నామన్నారుర. దౌర్జన్యంగా తమ ఇంట్లో తిష్టవేసిన విజయలక్ష్మి అమ్మ జయమ్మపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తమ ఇంటిని తిరిగి తమకు స్వాధీనపరచాలని ఎస్పీని వేడుకున్నారు. తమ పరిధి మేరకు న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారని సుధీర్ తెలిపారు.

ఎన్డీఏ హామీలన్నీ నెరవేరుస్తున్నాం : ఆరణి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పెన్షన్లు సమయానికి లబ్దిదారుల ఇంటికి వెళ్ళి అందిస్తున్న ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్పౌజ్ పెన్షన్ లను ఐదేళ్ళ తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు పునరిద్ధరించారని ఆయన చెప్పారు. రెండో డివిజన్ సచివాలయం ఒకటి పరిధిలో పెన్షన్లను ఎన్డీఏ కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం ఉదయం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతిలో 18 వేల 773 మందికి 8 కోట్ల 25 లక్షలా 7 వేల 500 ల రూపాయులు ప్రతి నెలా అందిస్తున్నట్లు చెప్పారు. 2019 మే నుంచి 2024 అక్టోబర్ వరకు నిలిచిపోయిన స్పౌజ్ పెన్షనలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు లబ్దిదారులకు అందించినట్లు ఆయన తెలిపారు. తిరుపతిలో 285 మందికి స్పౌజ్ పెన్షన్లు అందుకున్నారని ఆయన చెప్పారు.

ఈ కార్యక్రమంలో యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, నాయి బ్రాహ్మన కార్పోరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, డి.ఈ.రమణ పాల్గొన్నారు.

పక్కా ఆధారాలతోనే చెవిరెడ్డి అరెస్టు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అవినీతిలో కింగ్ జగన్మోహన్‌రెడ్డి అని, లిక్కర్‌స్కాంలో పక్కా ఆధారాలతోనే చెవిరెడ్డిని అరెస్టు చేశామని తుడ ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన స్వగృహంలో మీడియాతో మాట్లాడుతూ అవినీతిపరులను, దొంగలను, సంస్కారం లేని వ్యక్తులను వెనకేసుకొచ్చే జగన్మోహన్‌రెడ్డికి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. మహిళా శాసనసభ్యురాలిని అసభ్యకరంగా మాట్లాడి, వ్యక్తిగతంగా దూషించిన ప్రసన్నకుమార్‌రెడ్డిని, ఒక తల్లిని అనరాని మాటలను అని వ్యక్తిగత దూషణలు చేసిన వల్లభనేని వంశీలను పరామర్శించడానికి జగన్మోహన్‌రెడ్డి రావడం విడ్డూరంగా ఉందన్నారు. లిక్కర్‌స్కాంలో ప్రజాధనాన్ని వాటాలు వేసుకుని వైసిపి నాయకులు పంచుకున్నారన్నారు. ప్రతినెలా రూ.500 కోట్లు దోచేశారని విమర్శించారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పీఏలు, గన్‌మెన్‌లు ఎక్కడెక్కడ డబ్బులు తీసుకున్నారు, ఎక్కడ దాచిపెట్టారు, ఎవరెవరికి ఇచ్చారు, వారి వాహనాలు ఎక్కడెక్కడ తిరిగాయి శాటిలైట్ ఆధారాలు రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఉన్నాయన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఇలానే వ్యవహరిస్తే ప్రజలు తగిన విధంగా బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

టీటీడీకి రూ.25 లక్షలు విరాళం

ప్రజాశక్తి -తిరుమల

హైదరాబాద్ కు చెందిన పి.శ్రీకాంత్ అనే భక్తుడు శుక్రవారం టీటీడీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.25 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

తునాతునకలైన చేతివేళ్లు

నాటు బాంబు పేలి ఉపాధి కూలీకి తీవ్రగాయాలు

ప్రజాశక్తి -నాగలాపురం

నాటు బాంబు పేలి ఉపాధి కూలీకి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం నాగలాపురం మండలంలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లి పంచాయతీ కస్తూరి నాయుడు కండ్రిగ ఎస్టి కాలనీ అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఉపాధి కూలీలు ఉపాధి హామీ పనులు చేపట్టారు. ఆ సమయంలో సురుటపల్లి పంచాయతీకి చెందిన లింగమ నాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన ఉపాధి కూలీ జమునమ్మ (60) ఉపాధి పనుల్లో భాగంగా పనులు చేస్తుండగా వేట కోసం గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన నాటు బాంబు ఆమె చేతికి తగిలింది. ఆ నాటుబాంబు ఒక్కసారిగా పేలడంతో జమునమ్మ ఎడమ చేతికి తీవ్ర గాయమయ్యింది. వెంటనే అక్కడి ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు గాయాల పాలైన జమునమ్మను సమీప తమిళనాడు ప్రాంతం లోని ఊత్తుకోట్టయ్ జిహెచ్‌కి తరలించి ప్రధమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నై స్టాండ్లీ హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటన పై ఫీల్డ్ అసిస్టెంట్ మోహన, భాధితు రాలి బంధువులు నాగలాపురం పోలీస్ లకు ఫిర్యాదు చేసారు. ఘటన జరిగిన ప్రాంతం సత్యవేడు పరిధిలోకి రావడంతో సత్యవేడు పోలీస్ లు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడల్లో రాణిస్తున్న ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

బైరాగిపట్టెడలోని మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు జులై 31వ తేదీన శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన సబ్‌జూనియర్ జూడో పోటీల్లో రాణించారు. పదో తరగతి చదువుతున్న ఎన్.యుగేంద్ర గోల్డ్‌మెడల్ సాధించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎన్.చరణ్, సి.కృష్ణ సిల్వర్ మెడల్ సాధించారు. ఎ.ధరణిపతి, ఆర్.హరి, పి.వంశీ, వి.దాదా, ఎన్.డాన్‌చరణ్ తృతీయ బహుమతి గెలుపొందారు. విజేతలు ఆగస్టు 9, 10 తేదీల్లో గుంటూరులో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు టి.పరంధామనాయుడు, వ్యాయాయ ఉపాధ్యాయిని పి.విజయకుమారి, వ్యాయాయ ఉపాధ్యాయులు పి.హేమంత్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పి.మునయ్య అభినందించారు.

- ఏర్పేడులో... ఇటీవల జరిగిన జిల్లాస్థాయి జూడో సబ్ జూనియర్ కాంపిటీషన్లో పల్లం విద్యార్థులు 4 గోల్డ్ మెడల్స్, 9 సిల్వర్ మెడల్స్ సాధించినందుకు గర్వంగా ఉందని ప్రధానోపాధ్యాయులు ఆనంద్ అన్నారు. సౌకర్యాలు సరిగా లేకపోయినా గతంలో కూడ నేషనల్ స్థాయిలో రాణించడం జరిగిందని, త్వరలోనే తగిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఈనెల 8న గుంటూరులో జరగబోయే ఇంటర్ డిస్టిక్ జూడో సబ్ జూనియర్ కాంపిటీషన్‌కు గోల్డ్ మెడల్ సాధించిన పల్లం హాస్టల్ విద్యార్థులు రాము, లక్ష్మణ్, విష్ణు ఎంపికయ్యారని తెలియజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు వాణి, సోమశేఖర్ ను అభినందించారు.

రేణిగుంటలో... మండలంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్లస్ విద్యార్థినులు విద్యలోనే కాకుండా క్రీడల్లో రాణిస్తూ తమ ప్రతిభను చాటుకున్నారు. జులై 14 వ తేదీ జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ గ్రాప్లింగ్‌గ్రీడా పోటీల్లో విజయం సాధించి జూలై 26వ తేదీ నుండి జూలై 29వ తేదీ వరకు చత్తీస్గడ్ రాష్ట్రం బిలాస్పూర్ లోని జరిగిన ఐదవ జాతీయ రెజ్లింగ్ గ్రాప్లింగ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థినిలు విశేష ప్రతిభ కనబరిచి పోటీల్లో బంగారు 4 పతకాలు, వెండి 5 పతాకాలు, రజిత 3 పతాకాలు కైవసం చేసుకున్నారని విజేతలను ప్రధానోపాధ్యాయులు శ్యామల అభినందించారు.

క్రీడల్లో రాణిస్తున్న ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు

సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తడ

ఈనెల 3, 4 తేదీల్లో సూళ్లూరుపేట పట్టణంలో నిర్వహించనున్న తిరుపతి జిల్లా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి విజ్ఞప్తి చేశారు. భారత గడ్డపై వందేళ్ల పోరాట చరిత్ర సిపిఐకి ఉందన్నారు. సూళ్లూరుపేట కార్యాలయంలో నియోజకవర్గ కార్యదర్శి సి.సుధాకర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. దున్నేవానికే భూమి దక్కాలని,శ్రమ ఫలితం కార్మికులకు దక్కాలని సుదీర్ఘకాలంగా పోరాడుతున్నామన్నారు. తిరుపతి జిల్లాలోనూ అనేక పోరాటాలను నిర్వహించి భూమిలేని పేదలకు ఇళ్లు, నిరుపేదలకు భూమిని పంచి ఇచ్చామన్నారు. మూడో తేదీ సూళ్లూరుపేట సిపిఐ కార్యాలయం నుంచి పట్టణ పురవీధుల మీదుగా బస్టాండ్ వరకూ మహా శ్రామిక ప్రదర్శన, బహిరంగసభ ఉంటుందన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హరినాథ్‌రెడ్డి హాజరవుతారన్నారు. ప్రదర్శనలో డప్పులు, కోలాటాలు, భజన బృందాల కళారూపాలు ఉంటాయన్నారు. చిన్నం పెంచలయ్య, కె.రాధాక్రిష్ణ, కత్తిరవి, జనమాల గురవయ్య పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో పి.మురళి

జూడో పోటీలకు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : ఈ నెల 9,10 తేదీలలో రాష్ట్ర స్థాయిలో గుంటూరులో జరుగునున్న జూడో పోటీలకు దొరవారిసత్రం మండలం ఏకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాల పిడి రమణయ్య వివరాలు వెల్లడించారు. గురువారం తిరుపతి జిల్లా, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ జూడో అండర్ 14 దొరవారిసత్రం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏకొల్లు విద్యార్థినిలు 9వ తరగతి హేమలత, 57 కేజీస్ లో బంగారు పతకం, ఏ.ఏంజెల్ 7వ తరగతి 52 కేజీస్‌లో బంగారు పతకం, ఎస్.రోస్ 7వ తరగతి 48 కేజీస్‌లో బంగారు పతకం, ఇందు 8 వ తరగతి 36 కేజీస్‌లో రజిత పథకం, చైత్ర 7వ తరగతి, పార్టిసిపేషన్ సర్టిఫికెట్ సాధించారని తెలిపారు. 9,10 తేదీలలో గుంటూరులో జరుగు రాష్ట్రస్థాయి జూడో పోటీలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలియజేశారు. విజేతలను అభినందించి సర్టిఫికేట్లు ప్రదానం చేశారు.

ఐటా ఉమెన్స్ వన్ ల్యాక్ సింగిల్స్ విన్నర్‌గా లక్ష్మీ సిరి దండు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదలో జూలై 28 నుండి ఆగస్ట్ 1 వరకు జరిగిన ఐటా (ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్) ఉమెన్స్ వన్ ల్యాక్ టోర్నమెంట్‌లో గూడూరుకు చెందిన లక్ష్మీ సిరి దండు గెలుపొందారు. ఈమె క్వార్టర్ ఫైనల్స్‌లో తెలంగాణకి చెందిన తానియా సాపై 6- 0, 1- 0(రిటైర్డ్) తో గెలుపొందారు. సెమీ ఫైనల్స్ లో తెలంగాణ కి చెందిన మనోజ్ఞ మదసు 6- 1, 2- 6, 4- 1 (రిటైర్డ్) పై గెలుపొందింది. అదేవిధంగా ఫైనల్స్‌లో తమిళనాడుకు చెందిన జోయల్ నికోల్ 6- 1, 6- 3 పై గెలుపొంది, టోర్నమెంట్ విజేతగా నిలిచారు. ఈమె గతంలో పలు అంతర్జాతీయ, జాతీయ టోర్నమెంట్లలో పాల్గొని పలు పతకాలను సాధించారు.

పుత్తూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో పివికేఎన్ డిగ్రీ కళాశాలలో జరిగిన, జిల్లా స్థాయి పోటీల్లో పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విద్యార్థినులకు ప్రథమ స్థానం లభించింది. సమాచార హక్కు చట్టం ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం చిత్తూరు పివికేఎన్ కళాశాలలో జరిగిన పోటీలలో పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిబిఏ తృతీయ సంవత్సరం చదువుతున్న పూజారి లావణ్యకు వ్యాసరచనలో ప్రథమ స్థానం, బీకాం (సిఏ) తృతీయ సంవత్సరం చదువుతున్న వరలక్ష్మికి ఉపన్యాసం పోటీలో ప్రథమ స్థానం లభించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి వారిని అభినందించారు. వారు వచ్చే వారం కడపలో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య, డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ దేవకి,డాక్టర్ వెంకటేశన్, డాక్టర్ గంగయ్య,డాక్టర్ తిరుమలయ్య, సావిత్రి పాల్గొన్నారు.

సహజ కవయిత్రి తరిగొండ వెంగమాంబ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తెలుగులో ప్రత్యేక సహజ కవయిత్రిగా, భక్తురాలిగా మాతృశ్రీ తరిగొండ వెంగమాంబకు గుర్తింపు ఉందని టిటిడి అన్నమాచార్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి డాక్టర్ మేడసాని మోహన్ అభివర్ణించారు. వెంగమాంబ 208వ వర్థంతిని పురస్కరించుకుని తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో శుక్రవారం సంగీత కచేరి, సాహితీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేడసాని మోహన్ మాట్లాడుతూ, వెంగమాంబ రాసిన 18 పుస్తకాలలో ఆద్యాత్మిక, భక్తి, యోగ అంశాలకు అధిక ప్రాదాన్యత ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్ట్ ఇంఛార్జ్ సంచాలకులు రాజగోపాల రావు, అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ లత తదితరులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ వేస్ట్ పోలాల్లోకి..!

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో సెప్టిక్ ట్యాంక్ యాజమానులు ఇష్టానుసారం వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూన్నారు. ట్యాంకర్ డ్రైవర్లు, సెప్టిక్ ట్యాంకుల నుంచి మలినాలను సేకరించి డంపింగ్ యార్డ్‌కి తరలించకుండా పంట పొలాలలో పోస్తూ పరిసరాలను కలుషితం చేస్తున్నారు. గురువారం సాయంత్రం మున్సిపాలిటీ 21వ వార్డులో వున్న నత్తం గ్రామం సమీపంలోని పంట పొలాల్లో ట్యాంకర్ వ్యర్థాలను పోస్తుండగా స్థానికులు గమనించి వీడియోలు, ఫోటోలు తీసి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా మున్సిపల్ సిబ్బంది ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరి చర్యలతో దుర్వాసన వెదజల్లుతూ, అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ హితసంఘాలు మలినజలాల వల్ల భూగర్భజలాలు కలుషితమవు తున్నాయని హెచ్చరించారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని తక్షణమే సెప్టిక్ ట్యాంకర్ల యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆగస్టు 27వ తేదీ వినాయక చవితి పండుగ జరుగుతుందని 31వ తేదీ నిమజ్జన ఏర్పాటు కార్పొరేషన్ తరపున చేయాలని నిమజ్జన కమిటీ సభ్యులు శుక్రవారం కమిషనర్ మౌర్యకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నిమజ్జన కమిటీ నాయకులు సామాన్య శ్రీనివాస్, ఆర్‌సి మునికృష్ణలు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో మున్సిపల్ కార్పొరేషన్ నిమజ్జనం ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్పందించిన కమిషనర్ ఏర్పాట్లు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు ఊక విజయ్ కుమార్, గుండాల గోపీనాథ్ పాల్గొన్నారు.

జగన్‌ను రాజకీయంగా బహిష్కరించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అవినీతి, అక్రమాలకు బాస్‌గా ఉన్నారని, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని విమర్శించడం మంచి పద్ధతి కాదని, జగన్‌ను రాజకీయంగా ప్రజలు బహిష్కరించాలని రాష్ట్ర యాదవ అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ కోరారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి లిక్కర్ స్కాం ధనం 11 కోట్లు సిట్ అధికారులకు పట్టుబడడంతో దాని నుండి ప్రజల దృష్టి మరల్చడానికి నెల్లూరు జిల్లా పర్యటన చేశారన్నారు. మహిళలను కించపరుస్తూ మాట్లాడిన వారిని వారించాల్సిన బాధ్యతగల వ్యక్తిగా ప్రవర్తించకుండా, దూషించిన వ్యక్తులను సమర్థించుకోవడం దారుణమన్నారు. తప్పు చేసిన వారు చట్టం ముందు నిలుచోక తప్పదన్నారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ, రాష్ట్ర టిడిపి మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

అక్కడ మరమ్మతు.. ఇక్కడ ట్రాఫిక్ జామ్

సమయానికి కాలేజీలకు, గమ్యాలకు చేరుకోలేక అవస్థలు పడుతున్న విద్యార్థులు, ప్రయాణికులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఆర్డియం థియేటర్ ఎదురుగా రైల్వే గేటు మూసివేయడంతో ట్రాఫిక్ సమస్య నెలకొన్నాయి. తిరుపతి జిల్లా, పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో ఆర్డియం థియేటర్ ఎదురుగా కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంవత్సరాల క్రితం రైల్వే గేటు ఏర్పాటు చేసింది. ఈ గేటు ద్వారా నారాయణవనం, ఇచ్చారు, నాగలాపురం, తమిళనాడు కు అదే మార్గంలో తిరుపతి, నగరి వైపు కూడా వాహనాలు వెళుతూ రద్దీగా ఉంటుంది. మరమ్మతులు జరుగుతూ గేటును మూసివేయడంతో, వాహనాలన్నీ ఎంపీ రోడ్డులో ఉన్న రహదారికి మళ్లించడంతో ఆ దారి రద్దీగా మారిపోయింది. ట్రాఫిక్ జాయ్ అయి వాహనాల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గుతున్నారు. అదే మార్గంలో ఒక ఇంజనీరింగ్ కళాశాల, డిగ్రీ కళాశాల ఉన్నాయి. విద్యార్థులు కళాశాలకు వెళ్లాలంటే వేరే మార్గం లేక, ట్రాఫిక్‌లో చిక్కుకుని సమయానికి తరగతులకు హాజరవలేకున్నారు. అలాగే మరో ప్రాంతం మరాఠీ గేటు వద్ద ఒకే దారి ఉండటంతో, అటు నగరి వైపు, ఇటు తిరుపతి వైపు వెళ్లాలంటే ఈ దారి ద్వారానే వెళ్లాలి. ఇక్కడ ప్రధాన సమస్య రైల్వే గేటు వేయడం.. మూడు నాలుగు రైల్లు వెళ్లన తరువాత కానీ గేటు తెరవకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నగిరి వైపు వెళ్లే చోట నాలుగు కళాశాలలు ఉన్నాయి. విద్యార్థులు సమయానికి కళాశాలకు వెళ్లలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. మరాఠీ గేటు నుంచి నందిమంగళం వెళ్లే అప్రోచ్ రోడ్డు ఏర్పాటుచేసి అండర్ బ్రిడ్జిల కలిపితే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని విద్యార్థులు, వాహనదారులు కోరుతున్నారు. నగిరి శాసనసభ్యులు చొరవ తీసుకొని రహదారి సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

గేటు మూత.. వాహనదారుల వెత

బ్యాంకులో సొమ్ము భద్రతకు కట్టు దిట్టం : ఎస్పీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: బ్యాంకుల్లో దాచిన ప్రజల సొమ్ముకు భద్రత కట్టుదిట్టం చేశామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. శుక్రవారం అయిన విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకుల్లో దాచుకున్న ప్రజల సొమ్ముకు భద్రత విషయమై ఇటీవలే బ్యాంక్ అధికారులతో సమావేశం నిర్వహించమన్నారు. మూడు రోజుల క్రితం హిందూపురం బ్యాంకులో 11 కిలోల గోల్డ్ రాబరీ జరిగిన విషయం తెలిసిందే. ముందస్తు అప్రమత్తతతో తిరుపతి బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించి పది అంశాలపై చర్చించినట్లు తెలిపారు. బ్యాంక్ సిబ్బంది, పోలీసులు కలిసి రక్షిస్తేనే ప్రజల ధనం సురక్షితమన్నారు.

వాహనాలపై స్పెషల్ డ్రైవ్

ట్రాఫిక్‌కు, ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్న అధిక శబ్దాలు ఉపయోగించే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. అధిక శబ్దాలను వెలువరించే హారన్స్‌ను తొలగించామని తెలిపారు. అధిక శబ్దాల హారన్‌లు, సైలెన్సర్లను వాడకూడదని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న హారన్సును రోడ్డు రోలర్ కింద వేసి ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసంస్థల యజమానులకు అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ రవిమనోహరచారి ఆధ్వర్యంలో రామ తులసి కళ్యాణ మండపంలో తిరుపతిలోని స్కూల్స్, కాలేజీల యాజమాన్యాలకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ స్కూలు పెట్టడం ఎంత ముఖ్యమో దానికి సంబంధించిన భద్రత కూడా ఏర్పాటు చేయడం అంతే ముఖ్యమని తెలియజేశారు. స్కూల్స్, కాలేజీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పటిష్టమైన సెక్యూరిటీని నియమించాలని తెలిపారు. ఇంటర్ విద్యార్థులను రాజకీయ సభలకు పంపవద్దని తెలిపారు. స్కూలు బస్సుల కండిషన్, పత్రాలు, డ్రైవర్ లైసెన్స్‌లు పక్కాగా ఉండాలని తెలిపారు. విద్యార్థుల సంరక్షణకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ ఆఫీసర్లు, డీఈఓ, స్కూల్స్, కాలేజీలా యాజమాన్యం పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

11న ధర్నాను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - సత్యవేడు: విద్యుత్ ఛార్జీల పేరిట నిలువు దోపిడిని, ప్రమాదకర స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, ఆగస్టు 11వ తేదీన జరగనున్న రాష్ట్రవ్యాప్త ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి జనార్ధన్, ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్ సత్యవేడు పట్టణంలో ఇంటింటా కరపత్రాలను పంచిపెట్టారు. దాసరి జనార్ధన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో తొమ్మిది సార్లు కరెంటు చార్జీలు పెంచి వేలకోట్ల భారం ప్రజలపై వేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీకి కట్టుబడక విద్యుత్ చార్జీలను తగ్గించకపోగా చట్ట సవరణలు చేసి ఏడాది కాలంలో అపరిమితంగా పెంచుతూ, స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచుకోవటానికి పూనుకుందన్నారు. ప్రజల సొమ్మును కార్పొరేట్లకు దోచిపెట్టె ప్రయత్నం ప్రభుత్వం చేపడుతుందన్నారు. స్మార్ట్ మీటర్లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అరుణాచలం, మురళి, అనిల్ కుమార్, కృష్ణయ్య, తిరుమలరెడ్డి, అమ్ములు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు చేరుకున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేరుకున్నారు. ఆయనకు టిటిడి అదనపు ఈఓ స్వాగతం పలికి బస ఏర్పాట్లను చేశారు. శనివారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన శ్రీవారిని దర్శించుకుంటారని టిటిడి అధికారులు వెల్లడించారు.

సీనియారిటీ ప్రకారం ఎంఈఓ 1ను నియమించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఉమ్మడి సీనియారిటీ ప్రకారం మండల విద్యాశాఖ అధికారి 1లను నియమించాలని కోరుతూ ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. శుక్రవారం మంగళం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళం ట్రెండ్స్‌లో ఏపీ యుఎస్, పిఆర్‌టియు సంఘాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. గవర్నమెంట్ మేనేజ్మెంట్ స్కూల్ అసిస్టెంట్లను ఎంఈఓ 1 గా నియమించడం సరికాదన్నారు. ఇలాంటి నిర్ణయం ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను అవమానించడమే అన్నారు. ప్రభుత్వాధికారులు ప్రభుత్వ ఉపాధ్యాయులకు వత్తాసు పలుకుతూ ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్‌కు సంబంధించి కోర్టు కేసు పెండింగ్లో ఉండగా ఇలాంటి చర్యలు చేపట్టడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు బాలాజీ, సాంబిరెడ్డి, సుభాష్ చంద్రబోస్, కేశవుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల పాదయాత్రికుల విశ్రాంతి భవనం ప్రారంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలో శ్రీ ద్రౌపతి దేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి వారి దేవస్థానంలో, తమిళనాడు నుంచి వచ్చే తిరుమల పాదయాత్రికుల విశ్రాంతి భవనం-2ను నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ సంఘం కార్పొరేషను చైర్మన్ నరసింహ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ బీసీఆర్ యుగంధర్, తడుకు సింగల్ విండో చైర్మన్ కరుణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణతో ట్యాగ్‌సాల్ నోవా కోడ్ న్యూరో ప్రైవేట్ లిమిటెడ్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: విద్యాసంస్థల భద్రత, నిర్వహణకు ఆధునిక ఏఐ యాప్ - నోవా యాప్‌కు విద్యా రంగం నుంచి హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. విద్యా రంగానికి వినూత్న పరిష్కారాలను అందించేందుకు ట్యాగ్‌సాల్ నోవా కోడ్‌న్యూరో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధునాతన సాంకేతికత ఆధారంగా రూపొందించిన ఏఐ ఇంటిగ్రేటెడ్ నోవా యాప్‌ను శుక్రవారం ఒక ప్రత్యేక కార్యక్రమంలో పరిచయం చేసింది. ఈ సంస్థ వ్యవస్థాపకులు అమన్, నవ్యలు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ఆవిష్కరణను వివరిస్తూ, విద్యాసంస్థల అవసరాలను పూరించే విధంగా ఎలా ఈ యాప్ పనిచేస్తుందో ప్రదర్శించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంటిగ్రేషన్ ద్వారా విద్యార్థుల డేటా విశ్లేషణ,వైద్య, సురక్షిత, హాజరు మానిటరింగ్ వ్యవస్థలు,రియల్ టైమ్ నోటిఫికేషన్ సిస్టమ్, తల్లిదండ్రులకు వెంటనే సమాచారం, విద్యాసంస్థ అవసరాలకు అనుగుణంగా పూర్తిగా కస్టమైజ్ చేయగల విధానం ఉన్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన పలు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల ప్రతినిధులు, విద్యా శాఖాధికారులు నోవా యాప్‌ను పరిశీలించి ప్రశంసించారు. విద్యార్థుల భద్రత, పరిపాలనా పారదర్శకత, తల్లిదండ్రులకు సమాచార వ్యవస్థ, విద్యా ప్రమాణాల మెరుగుదల వంటి అంశాలలో ఇది విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అమన్, నవ్యలు మాట్లాడుతూ భవిష్యత్తు విద్యను సాంకేతికతతో మిళితం చేయడం మా లక్ష్యమని తెలిపారు. ప్రతి పాఠశాలకూ ప్రత్యేకంగా కస్టమైజ్ చేయబడే విధంగా నోవా యాప్ రూపొందించామన్నారు. విద్యార్థుల భద్రత, మెరుగైన పాలన, తల్లిదండ్రులతో సమన్వయం ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు విద్యాసంస్థల యాజమాన్యాలు నోవా యాప్‌ను తమ పాఠశాలల్లో అమలు చేయడానికి ఆసక్తి చూపాయి. విద్యా రంగంలో ఇలాంటి ప్రయోగాలు మరిన్ని సంస్థల నుంచి రావాలని ఆకాంక్షించారు.

చెంచురెడ్డికి దామోదర్ రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అనారోగ్యం బారిన పడి తిరుపతి సంకల్ప హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సీనియర్ నేత తాటిపర్తి చెంచు రెడ్డిని కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాల్సిందిగా వైద్యులను కోరారు. చెంచు రెడ్డి త్వరగా కోలుకుని రాజకీయ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. సీతారామ్, సురేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధంగా పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. శివం టు శివం రోడ్డుకు, గిరి ప్రదక్షిణ రెండో దశ సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయడం జరిగింది. ఈవో బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో చెరువులో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - సత్యవేడు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన జేమ్స్ (33) మద్యం మత్తులో చెరువులో స్నానానికి దిగి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సత్యవేడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎస్సీ కాలనీకి చెందిన జేమ్స్‌కు తల్లి మాత్రమే ఉన్నారు. జేమ్స్ మత్తుకు బానిసై చిన్న చిన్న పనులు చేసుకుంటూ గడిపేవాడు. బుధవారం ఇంటి నుండి వెళ్లిన జేమ్స్ దళవాయి అగ్రహారం చెరువు కట్టపై ఉన్న గుడి వద్ద పనులు చేసి వచ్చిన డబ్బులతో మద్యం సేవించాడు. మత్తులో చెరువులోకి స్నానానికి దిగిన జేమ్స్ నీళ్లలోకి జారిపోయాడు. ఆ సమయంలో ఎవరు గమనించకపోవడంతో మృతి చెందాడు. శుక్రవారం ఉదయం చెరువులో తేలుతున్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సామాజిక పెన్షన్లు పంపిణీ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : భర్త చనిపోయిన నెలలోపే వితంతువులకు పెన్షన్ల పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. ఆయన శుక్రవారం పుత్తూరు రూరల్ మండలంలోని నేసనూరు గ్రామ పంచాయతీ సచివాలయంలో నూతనంగా మంజూరైన స్పౌజ్ కేటగిరి పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం : నూతనంగా మంజూరయిన భాగస్వామ్య పింఛన్లను మాజీ ఎంపీపీ డి.బిందు మాధవి శుక్రవారం నాయకులతో కలిసి పంపిణీ చేశారు.

ప్రజాశక్తి -కోట : కోట మండలం, కొత్తపాలెం పంచాయతీ పరిధిలో అర్హులైన 10 మంది వితంతువులకు కొత్తగా మంజూరైన పింఛన్లు సచివాలయం సిబ్బంది, టిడిపి నాయకులు నెల్లూరు మోహన్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండోవ పట్టణం, 20, 21 సచివాలయాల పరిధి, నర్సింగ్ రావు పేట, బి.సి.కాలనీ, ఎస్.ఆర్.ఎ. టాకీస్ ప్రాంతాల్లో 4వ క్లస్టర్ కో కన్వీనర్ అరికట్ల మస్తాన్ నాయుడు, 18వ యూనిట్ ఇన్ ఛార్జ్ ఎం.డి. అబ్దుల్ రహీం, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొని పెన్షన్ పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో సుమారు 150 మంది వితంతువులకు మంజూరైన పెన్షన్లను శుక్రవారం తెలుగుదేశం మండల ప్రెసిడెంట్ సుధాకర్ నాయుడుక చేతల మీదుగా పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - వాకాడు: తిరుపతి జిల్లా, వాకాడు మండలంలో స్పౌజ్ క్యాటగిరి పెన్షన్లను ఎంపీడీవో స్థానిక టిడిపి నాయకులు కాటంరెడ్డి రామలింగారెడ్డి పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపాలిటీ ఒకటవ వార్డులో శుక్రవారం ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చేతులు మీదుగా పెన్షన్లు పంపిణీ చేశారు. కొత్తగా మంజూరయిన 703 స్పౌజ్, డయాలసిస్ పింఛన్లు పంపిణీ చేశారు.

క్రైం న్యూస్

ఆర్టీసీ కాంప్లెక్స్ దుకాణాల్లో చోరీలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు, ఆర్టీసీ బస్టాండు కాంప్లెక్స్‌లో జరుగుతున్న వరుస దొంగతనాలు స్థానిక వ్యాపారులను కలచివేస్తున్నాయి. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షాపులపై రేకులు తొలగించి రెండు షాపుల్లో చోరీలకు పాల్పడ్డారు. మొదట టెక్సమో డీలర్ షాప్‌లో దొంగలు లోపలికి దిగి టేబుల్ డ్రాలో ఉంచిన సుమారు రూ.25,000 నగదు దోచుకెళ్లినట్లు యజమాని తెలిపారు. అదే విధంగా కలాం భాయ్ కూల్ డ్రింక్స్ షాప్‌లో పై రేకులు తొలగించి ప్రవేశించి రూ.6,000 నగదు దోచుకెళ్లారు. ఈ వరుస చోరీలతో వ్యాపారవేత్తలు ఆందోళన చెందుతున్నారు. పట్టణ నడి బొడ్డున, ఆర్టీసీ డిపో సమీపంలో ఇలా దొంగలు బీభత్సం సృష్టించడం పోలీసులకు సవాల్‌గా మారింది. స్థానికులు రాత్రిళ్ల పహారా బలపర్చాలని, దొంగలను త్వరగా పట్టుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తాగునీటి మోటారు వైర్లు చోరీ

ప్రజాశక్తి - తొట్టంబేడు: మండలంలోని తొట్టంబేడు పంచాయతీ ఒకటవ గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న నాలుగు తాగునీటి మోటార్లకు సంబంధించిన విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు తొట్టంబేడు మండలం సర్పంచ్ సుబ్బయ్య మండల పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీస్ శాఖ సిబ్బంది చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి విద్యుత్ వైర్ల చోరీకి పాల్పడిన దొంగలను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

అడవిలోకి చొరబడుతున్న వ్యక్తి అరెస్టు

పిడిలేని గొడ్డలి స్వాధీనం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు ప్రాంతంలో నిషేధిత అడవుల్లోకి ప్రవేశిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి పిడిలేని గొడ్డలిని టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ బాలిరెడ్డి మార్గానిర్దేశకత్వంలో ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఏఆర్ఎస్ఐ ఈశ్వర్ రెడ్డి టీమ్ స్థానిక ఎఫ్బీఓ కస్తూరి బాయితో కలసి గురువారం పుత్తూరు రేంజ్, పాలమంగళం అటవీ సెక్షన్‌లో కూంబింగ్ చేపట్టారు. అరణ్య కండ్రిగ అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు కనిపించారు. వీరిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, వారు అడవుల్లోకి పారిపోయారు. అయితే టాస్క్ ఫోర్స్ పోలీసులు ఒక వ్యక్తిని పట్టుకోగలిగారు. అతని వద్ద నుంచి పిడిలేని గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. అతనిని తమిళనాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు. పట్టుబడిన వ్యక్తిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తొట్టంబేడు : శ్రీకాళహస్తి నుంచి తడ మండలానికి వెళ్లే ప్రధాన రహదారిలో, తొట్టంబేడు మండలం, తంగేళ్లపాలెం పంచాయతీ పరిధిలో శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనం మీద వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సిఐ తిమ్మయ్య తెలిపిన వివరాల మేరకు గుర్తు తెలియని వాహనం ఢీకొనిందని, మృతుడి ఆచూకీ కూడా తెలియలేదని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి పంపించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పనులలో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి - వాకాడు: మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు వాకాడు మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం పర్యవేక్షించారు. పనులలో నాణ్యతతో పాటించాలని, సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE: TIRUPATI
I A No: 577 /2024, O.S.No.101/2024
Boddu Jayachandra S/o late Boddu Maraiah, R/o D.No:17-6-352, Aravapalli Street, Tirupati Town and District ...Plaintiff/Petitioner
Vs
U.Madhavidevi W/o M.Bhaskhar Chakaravarthy, R/o D.No:19-7-171, Upstairs, Hathiramji Colony, Tirupati town and district ...Defendant/Respondent
Suit Summons to Defendant
Notice to Respondent
Please take notice that the petitioner/plaintiff filed the above suit and petition in I.A.No: 577/2024 in the above Hon'ble court and it is posted to 11.08.2025 for your appearance before the above said court. If you have got any objection you may appear before above court on 11.08.2025 at 10.30 am either in person or through an Advocate and file your objections. If fail to do so, the mater will be decided ex-parte.
Hearing date : 11.08.2025.
K.GURRAPPA NAIDU
N.NARAYANA REDDY
Advocates, Tirupati.

గౌరవ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, రామచంద్రపురం
I.A. No. 724/2025 in A.S. No. 51/2023
Between:
దొంగ ఏడుకొండలు ...పిటిషనర్/అప్పీలెంటు
Vs
కడలి నారాయణ & others ...రెస్పాండెంట్లు
ప్రతివాది నెం-6:
దొమ్మేటి సీత, W/o. సూర్యనారాయణ, వయసు 51 సంవత్సరాలు, హిందూ, వ్యవసాయం, వసతి: డోర్ నెం.149, మారుతినగర్, కొర్లగుంట, తిరుపతి, తిరుపతి JCJCJ
ప్రకటన విషయము
గౌ॥ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, రామచంద్రపురం ఉత్తర్వు మేరకు, పై వ్యాజ్యంలో ప్రతివాది నెం.6 దొమ్మేటి సీత గారు ఈనెల **21-08-2025 ఉదయం 10.30 గంటలకు** స్వయంగా గానీ, లేదా తన తరఫున న్యాయవాది ద్వారా గానీ రామచంద్రపురం న్యాయస్థానంలో హాజరు కావలసినదిగా ఆదేశించబడినది. అయితే ఆమె హాజరు కాకపోతే, న్యాయస్థానం ఆమె గైర్హాజరీలోనే తగిన విధంగా విచారణ జరిపి తీర్పునందించవచ్చును.
కె.రామచంద్రరావు
పి.వి.ఎస్.జానకి
తేదీ: 27-07-2025 న్యాయవాదులు, రామచంద్రపురం
స్థలం: రామచంద్రపురం సెల్: 9440338801

ప్రభుత్వ భూమి ఆక్రమించి.. తాగునీరు అడ్డగించి..!

ప్రజాశక్తి - పిచ్చాటూరు: తిరుపతి జిల్లా, పిచ్చాటూరు మండలం, గోవర్ధనగిరి హరిజనవాడలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణం చేపట్టిన సంఘటన చర్చనీయాంశంగా మారింది. హరిజనవాడకు చెందిన తాగునీటి బోర్‌కి వెళ్లే దారిని పూర్తిగా మూసివేస్తూ గోడ నిర్మించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన సుమతి శంకర్ ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తూ దారిని అడ్డగించి గోడ కట్టినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడే బోర్ బావిని అడ్డగించడం, ప్రభుత్వ స్థలాన్ని అడ్డుగోడలతో ఆక్రమించడం అన్యాయమంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణంపై పలుమార్లు రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా, స్పందించడంల దేని అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మార్వో ఇచ్చిన నోటీసులను. వీఆర్‌ఓ ద్వారా అందించినా, నిర్మాణాన్ని ఆపకుండా కొనసాగించడంపై గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో గ్రామ ప్రజలు వినతిపత్రం సమర్పించారు. అక్కడి నుండి తహశీల్దార్ కార్యాలయానికి సమాచారం వెళ్లినా, స్పందన లేకపోవడంతో వీఆర్‌ఓ భూపతిని గ్రామస్తులు అడుగగా వచ్చి చూస్తాంలే.. అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు చెప్పారు. దీంతో అధికారుల తీరుపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామానికి చెందిన లేట్ రాధాకృష్ణకు సంతానం లేకపోవడంతో ఆయన తమ్ముడి కుమారుడు గుణశేఖర్‌కు ఆ భూమి చెందుతుందని గ్రామస్థులు చెబుతున్నారు. కానీ సుమతి శంకర్ ఆయన వద్ద నుంచి నేల కొనుగోలు చేశానంటూ ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించాడని ఆరోపణ. బాధ్యతగా నడుచుకోవాల్సి వీఆర్‌ఓ ఆక్రమణదారుడికి మద్దతిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంటనే విచారణ జరిపి అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి, బోర్ బావికి దారి కల్పించాలని

ఏకగ్రీవంగా వన సంరక్షణ కమిటీ

ప్రజాశక్తి -ఏర్పేడు : క్రిష్ణంపల్లి వన సంరక్షణ సమితి సభ్యులను సర్పంచ్ రాజేశ్వరి అధ్యక్షన ఏర్పేడు పోలీస్, రెవెన్యూ సమక్షంలో క్రిష్ణంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ 16 మంది సభ్యులుతో ఏర్పడింది. చంద్రశేఖర్ చైర్మన్‌గా, భూదేవి వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పరిశీలించారు. సిబ్బంది శుభ్రత పాటించాలని, మెను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇలంగోవ రెడ్డి, అడవి శంకరాపురం ఆయకట్ట చైర్మన్ పద్దు రాజు, బుజ్జి నాయుడు, మాజీ జెడ్పీటీసీ సుమాంజలి, డిల్లీ రాజేశ్వరి టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సహకార ఒప్పందం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పీజీ కళాశాల (టిటిడి), తిరుపతి, బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో మలేసియాలోని యూనివర్శిటీ మలేసియా తెరెంగ్గాను (యుఎమ్టి) లో ఫిషరీస్ అండ్ ఫుడ్ సైన్సెస్ విభాగానికి చెందిన డా. మన్సూర్ ఇస్మాయిల్ షేక్‌తో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సహకార ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం విద్యా నాణ్యతను పెంపొందించడమే కాకుండా, కళాశాల గ్లోబల్ ప్రాచుర్యానికి ఒక మైలురాయిగా నిలుస్తుందని ప్రిన్సిపాల్ డా. సి. నారాయణమ్మ, బయోటెక్నాలజీ విభాగాధిపతి డా. సి. భువనేశ్వరి తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు గ్లోబల్ అవకాశాలు విస్తరిస్తాయని, కళాశాల అంతర్జాతీయ గుర్తింపు మరింత బలపడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ నారాయణమ్మ పేర్కొన్నారు.

మీడియా ప్రతినిధులకు ప్రెస్ స్టిక్కర్లు పంపిణీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: జిల్లా వ్యాప్తంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల అభ్యర్థన మేరకు జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో రూపొందించిన ప్రెస్ స్టిక్కర్లను శుక్రవారం మీడియా ప్రతినిధులకు అందజేశారు. స్థానిక పోలీస్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రింటింగ్ ప్రెస్ వాళ్లు, మీడియా ప్రతినిధులకు కాని వాళ్ళు అనేకమంది మీడియాలో పనిచేస్తున్నమంటూ చలమణి అవుతున్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న నిజమైన మీడియా ప్రతినిధులకు ఇబ్బందికరంగా ఉంటుందని మీడియా ప్రతినిధులు తమ దృష్టికి తెచ్చారన్నారు. వారి అభ్యర్థులను దృష్టిలో పెట్టుకుని పది రోజులపాటు మా సిబ్బంది శ్రమించి, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు క్యూఆర్ కోడ్ తో కలిగిన ప్రెస్ స్టిక్కర్లు తయారు చేశారన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే మీడియా ప్రతినిధి పేరు, పని చేస్తున్నా సంస్థ పేరు, డెసిగ్నేషన్, ప్రభుత్వ గుర్తింపుతో కలెక్టర్ ఇచ్చిన అక్రిడేషన్ నెంబర్ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మురళి, బాల చంద్ర, సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వరిలో సమగ్ర సస్యరక్షణపై శిక్షణ

ప్రజాశక్తి -దొరవారిసత్రం : దొరవారిసత్రం మండలం, తల్లంపాడు సచివాలయ పరిధిలో శుక్రవారం వరిలో సమగ్ర సస్యరక్షణ అంశం మీద రైతులకు పీఎం-ఆర్ కె వి వై పథకం కింద జిల్లా వనరుల కేంద్రం తిరుపతి వారు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డిఆర్ సి తిరుపతి వ్యవసాయ అధికారి శ్రీనివాస్ ఖరీఫ్ సీజన్‌లో వరిలో సమగ్ర సస్యరక్షణ, ఆవశ్యకతను లాభాలను వివరించారు. రసాయనాల పిచి కారీతో పురుగులు, తెగుళ్ళ నియంత్రణ ఆఖరి అస్త్రంగా వాడాలన్నారు. మండల వ్యవసాయ అధికారి జ్యోతిర్మయ మాట్లాడుతూ వరి సాగులో సస్యరక్షణతో మెరుగైన దిగుబ డులు సాధించవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి కిరణ్మ యి మాట్లాడుతూ శనివారం అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకాల లబ్ధిదారులకు రూ. 7000 వారి అకౌంట్లో ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మేర్లపాక టోల్గేట్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలి



ప్రజాశక్తి -ఏర్పేడు : మేర్లపాక వద్ద ఉన్న టోల్గేట్ ఆపరేటర్ సాయి కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు తిరుపతి పర్యటన కు విచ్చేసిన కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రివర్యులు నితిన్ గట్కరికి ఫిర్యాదు చేశారు. అధిక చార్జీలు వసూలు చేస్తూ స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని టోల్గేట్ ఆపరేటర్ పై చర్యలు తీసుకుని తొలగించాలని కోరారు.

వాతావరణ ఆధారిత సేద్యం లాభదాయకం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వాతావరణ ఆధారిత సేద్యం రైతులకు లాభదాయకమని జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు పేర్కొన్నారు. వడమాలపేటలో పీఎం ఆర్కేవివై పథకం కింద జిల్లా వనరుల కేంద్రం తిరుపతి వారిచే రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు మాట్లాడుతూ, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా, పంట విత్తే సమయాన్ని, సాగు చేయవలసిన పంట రకాన్ని, రైతులు ఎంచుకోవాలని తెలిపారు. ఒకే రకమైన పంటను ఎప్పుడూ పండిస్తూ ఉంటే దిగుబడి తగ్గడమే కాక, చీడపీడల ఉధృతి ఎక్కువ తుందన్నారు. ఈ కార్యక్రమంలో వడమాల పేట మండల వ్యవసాయ అధికారి విజయ కుమార్ వివిధ పథకాలను, పంటల భీమా పథకాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, మోహన్, శ్రీవాణి, మోహన్ రాజా, జిల్లా వనరుల కేంద్రం ఏఈఓ రవి ప్రసాద్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను ప్రోత్సహించండి

ప్రజాశక్తి - క్యాంపస్ : చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకళపతి ఆచార్య ఉమా పిలుపునిచ్చారు. ఆప్కో మెగా ఎగ్జిబిషన్ డిస్కౌంట్ సేల్స్‌ను శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం లోని ఇందిరా ప్రియదర్శిని సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 7వ తేదీ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత అమ్మకములను విశ్వవిద్యాలయంలో ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజని, సెరికల్చరల్ విభాగాధిపతి ప్రొఫెసర్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

సప్తమోక్ష క్షేత్ర యాత్ర రైలు సేవను ఉపయోగించుకోండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): భారత రైల్వే శాఖ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు ద్వారా సెప్టెంబర్ 9న మహాలయ పక్ష ప్రత్యేక సప్త మోక్ష క్షేత్ర యాత్ర రైలు ద్వారా దేశంలోని పలు పుణ్యక్షేత్రాలకు మంచి ప్యాకేజీని సౌత్ స్టార్ రైల్, టూర్ టైమ్స్ నిర్వహిస్తుందని టూర్ టైమ్స్ డైరెక్టర్ విగ్నేష్ తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 రోజులపాటు దేశవ్యాప్తంగా ఏడు నదులు, నాలుగు జ్యోతిర్లింగాల ప్రాంతాలను ఈ ప్యాకేజీ ద్వారా చూపించి తిరిగి వారి స్వస్థలాలకు క్షేమంగా తీసుకొస్తామన్నారు. 650 మంది ప్యాసింజర్లను తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. మూడు విభాగాలుగా ఈ ప్రత్యేక రైలులో ప్యాకేజీ టికెట్ ధరను నిర్ణయించామని థర్డ్ ఏసి (కంఫర్ట్) రూ.45,750, సెకండ్ ఏసి (డీలక్స్) రూ.54,100, ఫస్ట్ ఏసీ (లగ్జరీ) రూ.69,500 గా ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు వారికున్న సౌలభ్యం మేరకు ఈ ప్యాకేజీ ట్రిప్పును క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రత్యేక రైలుకు 33 శాతం సబ్సిడీ కల్పించిందని తెలిపారు. ఈ రైలు సేవలు చాలామంది ప్రజలకు తెలియాలని సౌత్ స్టార్ రైల్ అండ్ టూర్ టైమ్స్ గా ప్రాచుర్యంలోకి తీసుకొస్తున్నామన్నారు. ప్రతి పర్యటన ప్రదేశంలో గైడ్, భోగిలలో భోజన సౌకర్యం, భద్రత కల్పించబడతాయన్నారు.

తల్లిపాలతోనే ఆరోగ్యవంతమైన సమాజం

ప్రజాశక్తి - క్యాంపస్ : తల్లిపాలతోనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించవచ్చని అధ్యయనకేంద్రం డాక్టర్ రాణి పేర్కొన్నారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో "తల్లిపాలతోనే ఆరోగ్య వంతమైన సమాజం" అనే అంశంపై ఎస్పీడబ్ల్యు డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు జరుగుతాయన్నారు. తల్లిపాలు ఇవ్వడం వలన రొమ్ము క్యాన్సర్ లాంటి వ్యాధులు వచ్చే అవకాశం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మావతి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణమ్మ , హోమ్ సైన్స్ హెడ్ లక్ష్మి, నాగమణి, చెంచులక్ష్మి, శ్రీవాణి, మహిళ అధ్యయన కేంద్రం సిబ్బంది ప్రీతి విద్యార్థులు పాల్గొన్నారు.

పీజీ, డిగ్రీ కళాశాల ప్రవేశాలు ప్రారంభించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, డిగ్రీ ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం బాధాకరమని, వెంటనే ఆదిశగా చర్యలు చేపట్టాలని ఏబిఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య వైవి రామిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉన్నత విద్యను అభ్యసించాలన్న విద్యార్థులు విద్యాసంవత్సరం కోల్పోకుండా ప్రవేశాల కోసం వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ హైర్ ఎడ్యుకేషన్ చైర్మన్ , రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ డిఎస్విఎస్ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పీజీ సెట్ నిర్వహించి ఫలితాలు విడుదల చేసినప్పటికీ ప్రవేశాలను చేపట్టకపోవడం విచారకరమన్నారు.

గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలోని గిరిజనులకు రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించి వారి ఉన్నతకి ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు తగిన తోడ్పాటు అందించాలని జిపిఎస్ జాతీయ అధ్యక్షులు శంకర్ నాయక్ కోరారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో జిల్లాలను ఒక యూనిట్‌గా పరిగణించి గిరిజనులకు రిజర్వేషన్ అందించి మైదాన ప్రాంతాల్లో ఉన్న గిరిజనులను అభివృద్ధి చెందేలా సహకరించాలన్నారు. రాబోయే ఏడాది నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణతో అసెంబ్లీ స్థానాలు పెరగనున్నాయని, రాష్ట్ర జనాభాలో మైదాన ప్రాంతాల్లో ఉన్న గిరిజనులను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాలలో ప్రాతినిధ్యం లభించేలా రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు చొరవచూపాలన్నారు. అనంతరం గిరిజన ప్రజా చైతన్య యాత్ర గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ విలేకరుల సమావేశంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్, జిపిఎస్ యువజన అధ్యక్షులు హనుమంతు నాయక్, చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షులు మంజు కుమార్ నాయక్, తేజ నాయక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారుకు సన్మానం

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు తహశీల్దారు రాజశేఖర్‌ను స్థానిక కాంగ్రెస్ నేతలు సన్మానించారు. శుక్రవారం సత్యవేడు కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు రఘునాథ్, జనరల్ సెక్రెటరీ చిన్నరాజ్, పట్టణ అధ్యక్షులు అంబేద్కర్ తదితరులు తహశీల్దారును కలిశారు. ఈ సందర్భంగా పివి పురం పంచాయతీ, చమర్థకండ్రిగ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు విన్నవించారు. గిరిజన కాలనీ చుట్టూ కంకర క్వారీలతో, వాయు కాలుష్యం బాగా పెరిగి వారు అనారోగ్య బారిన పడుతున్నారని తగ్గు చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - సత్యవేడు: ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ 9వ స్నాతకోత్సవం సందర్భంగా శుక్రవారం కళాశాల ఆవరణలో 2025 పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. అసోసియేట్ డీన్ (పూర్వ విద్యార్థి) ఆధ్వర్యంలో సాగిన ఈ కార్యక్రమంలో ప్రస్తుత గ్రాడ్యుయేట్లు, మునుపటి బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు, డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంవి కార్తికేయన్, ఇంకా రిజిస్ట్రార్, డీన్ సహా అధ్యాపక బృందం పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులను అభినందిస్తూ, కళాశాలతో అనుబంధాన్ని కొనసాగించాలని ప్రోత్సహించారు. ఈ సమావేశంలో ప్రత్యేకాంశంగా ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ పూర్వ విద్యార్థుల నెట్వర్క్ ను ప్రారంభించారు. ఇందులో 2025 వరకు, ప్రతి బ్యాచ్ నుండి ఇద్దరు ప్రతినిధులను (పూర్వ విద్యార్థులు) కళాశాలతో సంబంధాలను బలోపేతం చేయడానికి మరియు విద్యావేత్తలు, పరిశోధనలు, పరిశ్రమలలో సహకారాన్ని ప్రోత్సహించడానికి నియమించారు.

44వ రోజూ నిరసన దీక్షలు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: రామారావుని బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దీక్షలు శుక్రవారం నాటికి 44వ రోజుకు చేరాయి. ఈసందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ రామారావుని వెంటనే బదిలీ చేయాలని, కార్మికుల సమస్యల్ని పరిష్కరించడంలో కమిషనర్ నిర్లక్ష్య ధోరణితో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు వెంకటగిరి మండల జాయింట్ సెక్రెటరీ చిరంజీవి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాజయ్య, మున్సిపల్ యూనియన్ నాయకులు పెంచలయ్య, సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, రమణయ్య మాధురి, శుభ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో శుక్రవారం 50 మంది వృద్ధులకు, బాలింతలకు గూడూరు ప్రభుత్వ హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ హెలిన్ చేతుల మీదుగా పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షరీనా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు అత్తి మంజరి గోపాల్, జాయింట్ సెక్రెటరీ పేయ్యల రమణయ్య, సురేంద్రబాబు, సభ్యులు కసుకుర్తి కోటేశ్వరరావు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ స్కార్ఫ్ డే

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు ప్రపంచ స్కార్ఫ్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందించడానికి స్కౌట్ అండ్ గైడ్స్ ఎంతో ఉపయుక్తంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్చాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో పకడ్బందీగా విద్యాహక్కు చట్టం అమలు చేయాలని ఎంఈఓ ముని సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. శుక్రవారం కంచన పుత్తూరు వైసి గిరిజన కాలనీలో బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్న పిల్లలను, వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలో చేర్పించారు. ఎంఈఓలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా సామగ్రితోపాటు, భోజనం అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లీల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాష్ట్రంలో దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని దూదేకుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ సర్క్యులర్, వినతి పత్రాన్ని తహశీల్దార్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ నూర్ చాన్ బాషా, స్టేట్ వర్కింగ్ మహిళా ప్రెసిడెంట్ షేక్ దిల్షాద్, వైస్ ప్రెసిడెంట్ ఇబ్రహీం, జాయింట్ సెక్రెటరీ చాంద్ బాషా, ట్రెజరర్, సెక్రెటరీ నజీర్ గాంధీనగర్ సలీం మహిళ కార్యదర్శి సలీమా, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష... రైతు రక్ష

ప్రజాశక్తి-ఏర్పేడు: రైతు, భూమి బాగుండాలంటే భూసార పరీక్షలు తప్పనిసరని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ శాఖాధికారి వేణుగోపాలరావు పేర్కొన్నారు. పిఎమ్ఆర్‌కేవై పథకం క్రింద రైతు శిక్షణ కార్యక్రమాన్ని బండారుపల్లిలో నిర్వహించి, రైతులతో మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడితేనే రైతుకు సాగు ఖర్చు తగ్గడంతో పాటు, భూమికి ఆరోగ్యం చేకూరుతుందని, తద్వారా ఆహార భద్రత లభిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు మండల వ్యవసాయాధికారిణి సాగరిక, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రియాంక, జిల్లా వనరుల కేంద్రం ఏఈఓ రవిప్రసాద్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఉత్తరపు కండ్రిగ దళితవాడ, అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ వారోత్సవాలు 1 నుండి 7వతేది వరకు జరుగుతాయని ఐసిడిఎస్ సూపర్ వైజర్ అనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్ మంగళం పీహెచ్సీ డాక్టర్ హేమ భూషణ్ రెడ్డి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.